ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	563.10 (239.6552)	67,183	1800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.40 (3.54)	236.57	139.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	151.934 (17.2013)	నిల్	4,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.128 | డ్రెస్ : రూ.191 | స్కిన్‌లెస్ : రూ.215



అవగాహన లోపం.. సూర్యాపేట ఆసుపత్రిలో ఓపీ స్లిప్ కోసం క్యూలో ఉన్న మహిళలు

పేదలకు శాపం

» జిల్లా కేంద్రం ఆసుపత్రిలో అధునాతన డయాగ్నస్టిక్ కేంద్రం
» 94 రకాల పరీక్షలకు అవకాశం » అవగాహన లేక ప్రైవేట్ ఆసుపత్రులకు పేదలు

ప్రైవేట్ ఆసుపత్రుల్లో లేని అధునాతన ఆరోగ్యపరీక్షల యంత్రాలు సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయి. ఈ విషయంలో అవగాహన కల్పించాల్సిన వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యపరీక్షల కోసం ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారి జేబులకు చిల్లులుపడుతున్నాయి.ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూ.కోట్లుఖర్చు చేసి ఏర్పాటుచేసిన అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నా అవగాహనలేక సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇందుకు సూర్యాపేట ఆసుపత్రి తార్కాణంగా నిలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-భానుపురి)

సూర్యాపేటలోని జిల్లా ఆసుపత్రిలో 94 రకాల పరీక్షలు చేసే పరికరాలు ఉన్నాయి. ఇక్కడ జ్వరం,దగ్గు, జలుబు, డెంగీ, రక్తకణాలు, షుగర్ లెవల్స్, కొలెస్ట్రాల్ స్థాయిలు, లివర్, యూరిక్‌యాసిడ్, క్యాల్షియం, థైరాయిడ్, విటమిన్స్ లాంటి పరీక్షలతో పాటు 94 పరీక్షలు ఉచితం గా పొందే అవకాశం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంది. అయితే రోగులు ఏ పరీక్ష కోసమైనా ల్యాబ్‌ను వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఆసుపత్రిలో చివరలో ఏర్పాటుచేయడంతో అక్కడికి వెళ్లే సరికి సమయం వృథా అవుతోం ది. కొంతమంది సిబ్బంది పరీక్షా కేంద్రాల గురించి రోగులకు వివరిస్తున్నారు...

- మిగతా 8వ పేజీలో...

నిధుల్లేక పంచాయతీల్లో అభివృద్ధి పనులు నిలిచాయి. కనీసం చెత్తను డంపింగ్ యార్డులో వేద్దామన్నా, ట్రాక్టర్‌లో డీజిల్ పోయించేందుకు కూడా డబ్బుల్లేవు. దాతలను అడిగి గ్రామకార్యదర్శులు అంతో ఇంతో పనులు చేయిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర నిధులు నిలిచిపోయాయి. దీంతో నిధులకు కొరత ఏర్పడింది. గ్రామ కార్యదర్శులే ఆస్తిపన్నుతో పాటు సొంతంగా అప్పులు చేసి కొన్ని పనులను కొనసాగిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



ఇంటి పన్నులే ఆధారం

» నిధుల్లేక నిలిచిన పనులు » మాజీ సర్పంచ్‌లకు బకాయిలు రూ.7కోట్లు

వర్షాకాలం వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉంటుంది. ఈ సమయంలో గ్రామాలు ఎంతో పరిశుభ్రంగా ఉంచాల్సి ఉంటుంది. ఈ ఏడాది పంచాయతీల జనాభా ఆధారంగా 15వ ఫైనాన్స్ నిధులు విడుదలవుతాయి. ఒక వ్యక్తి రూ.99.05 చొప్పున విడుదల చేస్తారు. ఎస్టీ జనాభా ఉన్నచోట మొత్తం బడ్జెట్‌లో 15 నుంచి 20శాతం అధికంగా నిధులు విడుదలవుతాయి. అదేవిధంగా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా జనాభాధారంగా నిధుల విడుదల ఉంటుంది. ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో 15 ఫైనాన్స్ నిధులు నిలిచిపోయాయి. ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి ట్యాంకులు, వీధిలైట్లు ఏర్పాటుచేయాలి. అదేవిధంగా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో ఇతర అనేక పనులు చేపట్టాల్సి ఉంది. బీఆర్‌ఎస్ హయాంలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. వీటికోసం ప్రత్యేక నిధులు కేటాయించారు. ప్రతిగ్రామపంచాయతీకి ట్రాక్టర్‌ను అందజేశారు. ఆ సమయంలో కంపచెట్లను తొలగించడం, రోడ్ల నిర్మాణం, నర్సరీలను ఏర్పాటుచేయడం, శ్మశానవాటికల నిర్మాణాలను చేపట్టారు.

అదనంగా 11 పంచాయతీలు

ప్రస్తుతం జిల్లాలో 475 పంచాయతీలు ఉండగా మరో 11 పంచాయతీలను అదనంగా ఏర్పాటుచేశారు. మొత్తం 486 పంచాయతీలు కానున్నాయి. ఇటీవల కార్యదర్శుల నియామకం చేపట్టినప్పటికీ ఇంకా 20 పంచాయతీలకు కార్యదర్శుల కొరత నెలకొంది. జిల్లావ్యాప్తంగా 1925 మంది మల్టీపర్పస్ వర్కర్స్(పారిశుధ్య సిబ్బంది) పనిచేస్తున్నారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు అందజేస్తోంది. పంచాయతీ జనాభా ఆధారంగా ఇద్దరు నుంచి నలుగురి వరకు సిబ్బంది ఉన్నారు. 2022-23లో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.47.6కోట్లు మంజూరయ్యాయి. అదేసంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నిధులు రూ.6.75 కోట్లు మంజూరయ్యాయి.

ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌లో వర్షం నీటితో నిండిపోయిన వీధి

ఇంటి పన్నులతోనే ప్రస్తుత పనులు

ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీల్లో అత్యవసర పనులు చేపడుతున్నారు. జిల్లాలో రూ.12.24 కోట్ల ఇంటి పన్నులు వసూలు కావాల్సి ఉండగా నేటి వరకు రూ.11.15 కోట్లు వసూలయ్యాయి. సుమారు 92శాతం వసూలయినట్లు అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాక మాజీసర్పంచ్‌లు సతమతం

గ్రామాభివృద్ధి కోసం కొంతమంది సర్పంచ్‌లు

- మిగతా 8వ పేజీలో...

పదోన్నతులు బాధ్యతలు పెంచుతాయి: ఎస్పీ



పదోన్నతులు పొందిన కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతులు ఉద్యోగుల్లో బాధ్యతలను పెంచుతాయని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. జిల్లాలోని నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఉపేందర్, పాలకవీడులో పనిచేస్తున్న కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, మునగాలలో పనిచేస్తున్న శ్రీకాంత్ హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి పట్టీలు పెట్టి ఎస్పీ అభినందించారు. విధుల్లో మంచినడవడికతో శాఖకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లకొండ రాంచందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యం బూడిదపాలు



» మిల్లుల బూడిదతో ప్రజల అవస్థలు
» శ్వాస, చర్మవ్యాధుల బారిన ప్రజలు

హుజూర్‌నగర్ ప్రాంతంలోని పలు రైస్‌మిల్లులు వెదజల్లుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైస్‌మిల్లులు వెదజల్లే బూడిద జనావాసాలపై పడుతోంది. పట్టణంలోని కోదాడ రోడ్డు, మాధవరాయనిగూడెం, గోపాలపురం, మిర్యాలగూడ రోడ్డు ప్రాంతాల్లో కలిపి 23 రైస్‌మిల్లులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు రైస్ మిల్లుల బూడిదతో అవస్థలు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

కొద్ది నెలలుగా గాలిదుమారం పెద్దఎత్తున రావడంతో మిల్లుల నుంచి వచ్చే బూడిద టీచర్స్‌కాలనీ, మల్లన్ననగర్, ఎన్ఎస్‌పీ క్యాంప్, సీతారాంనగర్, మాధవరాయనిగూడెం ప్రాంతాల్లోని ఇళ్లపై పడుతోంది. పొల్యూషన్ కంట్రోల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని 28 వార్డుల్లో 48 వేల జనాభా ఉంది. పట్టణ పరిధిలో పలు రైస్‌మిల్లులు ఉండగా కేవలం నాలుగు రైస్‌మిల్లులకు సంబంధించి పర్యావరణ ఇబ్బందుల్లేని చర్యలు తీసుకున్నారు. మిగిలిన రైస్ మిల్లుల నుంచి వస్తున్న కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాని కి గురవుతున్నారు. 30 ఏళ్ల కిందట మిర్యాలగూడ రోడ్డులో రైస్‌మిల్లులు నిర్మించారు. కాగా ఇప్పుడు పట్ట ణం విస్తరించింది. పెద్దఎత్తున ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారు. శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది. అదేస్థాయిలో రైస్‌మిల్లులను మిల్లర్లు విస్తరించారు. రైస్‌మిల్లుల వల్ల పెద్దసంఖ్యలో ప్రజలు, కార్మికులు, కూలీలకు ఉపాధి లభిస్తుంది. ప్రతి ఏటా సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో రైస్‌మిల్లుల్లో ధాన్యాన్ని మరాడించే సమయంలో వస్తున్న బూడిద, పొగతో శ్వాస సంబంధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. మిల్లుల నుంచి దుమ్ము, ధూళి రావడంపై అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జనావాసాల మధ్య ఉన్న రైస్‌మిల్లులను వేరే ప్రాంతాలకు తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని 28 వార్డుల్లో ముఖ్యంగా సగం వార్డులకుపైగానే రైస్‌మిల్లుల బూడిద పడుతోంది. పట్టణంలోని గోపాలపురం రోడ్డు, చింతలబజారు, సీతారాంనగర్, మార్కెట్‌యార్డ్ బజార్, దీక్షిత్‌నగర్, మల్లన్ననగర్, ఎన్‌జీవో కాలనీ, ఎన్ఎస్‌పీ క్యాంప్ ప్రాంతాల్లోని ప్రజలు నిత్యం కాలుష్యంతో కుస్తీపడుతున్నారు. పట్టణం విస్తరించిన నేపథ్యంలో కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతోంది. ఇదిలా ఉండగా మిల్లుల నుంచి వస్తున్న బూడిద, బాయిలర్ల నుంచి వచ్చే నీటితో తమ పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని అనేక చెరువుల్లోనూ బాయిలర్ల నుంచి వచ్చే నీటితో జలరాశులు చనిపోతున్నాయని మత్స్యకార్మికులు వాపోతున్నారు. భూగర్భజలాలు కూడా కలుషితమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, గుండెకు సంబంధించిన వ్యాధులతో అటు చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

కాలుష్యంతో ప్రజలకు అనారోగ్యం



మిల్లుల నుంచి వస్తున్న కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న మిల్లులను సీజ్‌చేయాలి. కాల్యుష్యాన్ని నియంత్రించాలి. లేకుంటే ప్రజాఉద్యమాలు చేపడతాం.

- జక్కుల నాగేశ్వరరావు, న్యాయవాది హుజూర్‌నగర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

పెన్‌పహాడ్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, మాట్లాడారు. అనంతారం గ్రామంలో ఇంకుడుగుంతలు నిర్మిస్తున్న ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. గ్రామంలో 68 ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉండగా 33 మాత్రమే గ్రౌండ్ లెవల్ కావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 15వ తేదీ వరకు అన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో జానయ్య, తహసీల్దార్ లాలునాయక్, ఏపీవో రవి, ఏపీఎం అజయ్‌నాయక్, ఈసీ మహేష్, రాంకుమార్, సోమయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

ఆత్మకూరు(ఎస్), జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్ రవిని జీసీడీవో దయానందరాణి శుక్రవారం సస్పెండ్ చేశారు. 'ఆకలేస్తుంది అన్నం పెట్టండి అంటూ' ఈనెల 10వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. విద్యార్థులకు అన్నం పెట్టడంలో విఫలంకావడంతో విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. స్పందించిన జీసీడీవో దయానందరాణి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. హాస్టల్ బాధ్యతలు తాత్కాలికంగ కుడకుడ హాస్టల్ వార్డెన్ నాగేందర్‌కు అప్పగించారు.

ఎత్తిపోతల భూసేకరణకు రైతులు సహకరించాలి



సంతాపసభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడి

హుజూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి భూసేకరణకు రైతులు సహకరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ నేత నిజాముద్దీన్ సంతాపసభలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కొత్త ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి పైప్‌లైన్లు వేసేందుకు అవసరమైన భూసేకరణకు రైతులు సహకరించాలన్నారు. 55వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.1800 కోట్లతో ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని, భూసేకరణలో రైతులు అవాంతరాలు కలిగించవద్దన్నారు. భూసేకరణకు భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందన్నారు. మార్కెట్ కంటే అదనపు ధర కల్పిస్తున్నామని, రైతులు మం చి ఆలోచనతో భూమి ఇవ్వాలని కోరారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను రైతులు సమష్టిగా తీసుకోవాలన్నారు. ఎంబీ కెనాల్‌పై కూలిన వంతెన స్థానంలో కొత్త వంతెనను నిర్మిస్తామన్నారు. దివంగత కాంగ్రెస్ నేత నిజాముద్దీన్ విగ్రహఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మె ల్యే పద్మావతిరెడ్డి, వేనేపల్లి చందర్‌రావు, తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్న, ఈడ్పుగంటి సుబ్బారావు, దొంగరి వెంకటేశ్వర్లు, గొట్టె రామయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ రాధిక, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, జక్కుల వెంకయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, చక్కెర వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మంజునాయక్, పెండెం శ్రీనివాస్, కొట్టే సైదేశ్వరరావు, అజీజ్‌పాషా, దొంతగాని శ్రీనివాస్, సంతప్‌రెడ్డి, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులతో జీవాలు ఆరోగ్యం

కోదాడలో పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి

8

పారడే మొదటిసూత్రాన్ని చెప్పండి

» విద్యార్థులను ప్రశ్న అడిగి సమాధానం రాబట్టిన కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్
» హుజూర్‌నగర్‌లో ఇంటర్ విద్యార్థులకు భౌతిక శాస్త్రం బోధన



హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

హుజూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పారడే మొదటి సూత్రాన్ని చెప్పాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ విద్యార్థిని ప్రశ్నించారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన శుక్రవారం తనిఖీచేశారు. కొద్దిసేపు అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠం బోధించారు. ద్వితీయసంవత్సరం తరగతి గదిలోకి వెళ్లారు. అక్కడ ఎలక్ట్రానిక్ సబ్జెక్ట్ మీద క్లాస్ తీసుకున్నారు. అనంతరం వనజ అనే విద్యార్థిని పారడే మొదటి సూత్రాన్ని చెప్పాలని ప్రశ్నించారు. విద్యార్థిని సమాధానం చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు మోటివేషన్‌పై క్లాస్ తీసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. ఏదో ఒక రంగంలో నైపుణ్యత సాధిస్తే ఫలితం వస్తుందన్నారు. క్రమశిక్షణతో చదువుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. గ్రూప్-1లో ఉద్యోగాలు సాధించాలని, తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలంగా మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. విద్యార్థి దశలో బాగా చదివి క్రమశిక్షణతో ఉండడం వల్లనే కలెక్టర్లుగా, మునిసిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లుగా తాము పనిచేయగలుగుతున్నామన్నారు. మమ్మల్ని ఆదర్శంగా తీసుకోవాలని చదువుకోవాలని కలెక్టర్ హిత బోధ చేశారు. అనంతరం జూనియర్, డిగ్రీ కళాశాలల భవనాల నిర్మాణలను పరిశీలించి త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ గుంటిపల్లి శ్రీనివాసు, అధ్యాపకులు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలి

ప్రభుత్వ దవాఖానాల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ తేజస్‌నందాలాల్‌పవార్ కోరారు. పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని శుక్రవారం పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో లివర్ వ్యాధితో బాధపడుతున్న సతీష్ రోగితో మా ట్లాడారు. డాక్టర్లు సక్రమంగా వైద్యం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎంఓ సిబ్బంది కొరత ఉందని కలెక్టర్‌కు చెప్పగా తగు సలహాలు, సూచనలు అందించారు.

మోడల్‌కాలనీ ఇళ్లువెంటనే పూర్తిచేయాలి

మోడల్ కాలనీ ఇళ్లు వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ తేజస్‌నందాలాల్‌పవార్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఫణిగిరిగట్టు వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసిల్దార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎంఓ రవికుమార్, డాక్టర్ సింధు, వెంకటాద్రి, సునీల్‌కుమార్, సంతోష్, హౌసింగ్ డీఈ సిద్ధార్థ, డిప్యూటీ ఈఈ జంగయ్య, ఏఈ సాయిరామ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

సాగు చట్టాలపై అవగాహన ఉండాలి



తహసీల్దార్ కార్యాలయంలో సాగు చట్టాలపై మాట్లాడుతున్న రైతు సంక్షేమ కమీషన్ సభ్యుడు భూమి సునీల్

రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్

సూర్యాపేటరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయంలో రైతు సాగు చట్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష మంది రైతులకు సాగు చట్టాలపై అవగాహన కల్పించడం రైతుల న్యాయ అవసరాలపై అధ్యయనం చేయడానికి లీఫ్స్‌సంస్థ బృందం రాష్ట్ర వ్యాప్తంగా జూన్28 నుంచి అక్టోబరు 2 వరకు అన్ని గ్రామాల్లో సాగు న్యాయ యాత్ర పర్యటిస్తుందన్నారు. దుక్కిదున్నే నాటి నుంచి పండించిన పంటను మార్కెట్లో అమ్మేదాకా రైతులు ఎదుర్కొనే ఎన్నో సమస్యలు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు తగ్గట్లుగా సాగు సాఫీగా సాగటం కోసం ఎన్నో చట్టాలు వచ్చాయన్నారు.భూమి, వ్యవసాయానికి సంబంధించి రాష్ట్రంలో రెండు వందలకు పైగా చట్టాలు అమలులో ఉన్నాయని, వీటిని తెలుసుకుని వినియోగించుకోగలిగితేనే ఏరువాక సాగే పరిస్థితి ఉందన్నారు. రైతు సమస్యలపై అధ్యయనం చేయటం, సాగు చట్టాలపై అవగహన కల్పించడం రెండు వినూత్న ప్రయత్నాలు దేశంలోనే మొదటి సారి అన్నారు.

చట్టం రైతులకు చుట్టం కావాలి

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన సమావేశంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ మాట్లాడారు. వ్యవసాయానికి సంబంధించి రాష్ట్రంలో రెండు వందలకుపైగా చట్టాలు అమలులో ఉన్నాయన్నారు.

ప్రతి రైతుకు చట్టాల గురించి తెలియాలన్నారు. కార్యక్రమాల్లో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, డీఏవో శ్రీధర్‌రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, తహసీల్దార్లు కృష్ణయ్య, అమీన్‌సింగ్, ఏడీఏ జ్ఞానేశ్వరీ, ఏడీ కృష్ణసందీప్, ఏవో దివ్య, ఏఈవోలు ముత్తయ్య, శివ, పవన్, శివమూర్తి పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుడు రాజేష్ మృతి

● 2016 సర్జికల్ స్ట్రైక్‌లో కీలకపాత్ర ● నేడు భువనగిరిలో అంత్యక్రియలు

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన విశ్రాంత సైనికుడు తునికి రాజేష్(44) శుక్రవారం మృతి చెందారు. రెండు నెలల కిందటే ఉద్యోగ విరమణ చేశారు. ఢిల్లీలోని ఆర్మీ ఆస్పత్రిలో ఇటీవలే కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స జరగగా చికిత్సపొందుతూ ఆస్పత్రిలో మృతి చెందారు. 2016 సెప్టెంబర్‌లో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్‌లో పారా రెజిమెంట్ సైనికుడిగా కీలకపాత్ర పోషించారని సన్నిహితులు తెలిపారు. రాజేష్ తండ్రి తునికి నరసింహ సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆయన మృతి చెందారు. సోదరుడు కిషోర్ కూడా విశ్రాంత సైనికుడే. రాజేష్‌కు ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. భువనగిరి ధోబీవాడలోని స్వగృహం నుంచి శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా రాజేష్ మృతికి పలువురు సంతాపం తెలిపారు.



రాజేష్(ఫైల్‌ఫొటో)

చేపలవేటకు వెళ్లి చెరువులో గల్లంతు



కోమటికుంట చెర్వులో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న రెస్క్యూటీం

పాలకవీడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో చేపలవేటకు వెళ్లిన చెరువులో గల్లంతయ్యాడు. ఎస్ఐ కోటేష్, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాలకవీడు మండలం కోమటికుంట గ్రామానికి చెందిన రాతికింద లింగయ్య(57) భార్యతో కలిసి గురువారం రాత్రి అదే గ్రామశివారులోని చెర్వులో చేపల వేటకు వెళ్లాడు. అదే సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో నీటిలో పడిపోయాడు. గమనించిన భార్య గ్రామస్థులకు సమాచారం తెలిపింది. వెంటనే స్పందించిన గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని చెర్వులో వెతికారు. రాత్రి సమయం కావడంతో వెతుకులాట ఇబ్బందిగా మారింది. దీంతో తెల్లవారుజామున పడవల సహాయంతో వలలు వేసి వెతికినా లింగయ్య ఆచూకీ లభించలేదు. దీంతో సమాచారాన్ని రెస్క్యూ టీంకు అందించారు. శుక్రవారం ఉదయం నుంచి 12 గంటలుగా రెస్క్యూం టీం వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు పడిగాపులు కాస్తున్నారు. గల్లంతైన లింగయ్య ఆచూకీ లభ్యమయ్యే వరకు రెస్క్యూ టీం పనిచేస్తుందని ఎస్ఐ కోటేష్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దారుణహత్య

బచ్చన్నపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజిపేటకు చెందిన బత్తుల రాజిరెడ్డి(50) బతుకు దెరువు కోసం 25ఏళ్ల క్రితం బచ్చన్నపేటకు వచ్చి పలు హోటళ్లలో పనిచేస్తుండేవాడు. కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగాలేక రోడ్ల వెంట తిరుగుతూ, రాత్రివేళ తనకు తోచిన ప్రదేశంలో నిద్రిస్తుండేవాడు. శుక్రవారం ఉదయం చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో తలపై బలమైన గాయాలై రక్తపు మడుగులో మృతిచెంది ఉన్నాడు. కర్రలు, రాళ్లతో తలపై బాది చంపినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. రాజిరెడ్డి అవివాహితుడు కాగా, అతడి సోదరుడు జోగిరెడ్డి, చెల్లెలు వరలక్ష్మీ ఆలీంపూర్‌లో ఉంటున్నారు. మతిస్థిమితంలేని వ్యక్తిని చంపాల్సిన అవసరం ఏమొచ్చిందనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ అబ్బయ్య, ఎస్ఐ ఎస్కే హమీద్ సంఘటనా స్థలానికి చేరుకుని, జాగిలాలను రప్పించి పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరుపుతున్నారు. రాజిరెడ్డి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులపై దివ్యాంగురాలి ఫిర్యాదు

మఠంపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల వద్ద దాచిన సొత్తు, భూమి పత్రాలను తిరిగి ఇవ్వడంలేదని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల పోలీసస్టేషన్‌లో ఓ కుమార్తె శుక్రవారం ఫిర్యాదుచేసింది. ఎస్ఐ బాబు, ఫిర్యాదురాలు బక్కమంతులగూడెం గ్రామానికి కాసాని రేణుక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేణుకకు 20 ఏళ్ల కిందట పెళ్లి కాగా, ఆ తర్వాతతో పలుకారణాలతో భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా జీవిస్తోంది. ఆ సమయంలో భర్త నుంచి వచ్చిన నగదు, నగలు, భూమి పత్రాలను తల్లిదండ్రులు వద్ద దాచింది. అవసరాల నిమిత్తం తిరిగివ్వాలని కోరినా ఇవ్వకుండా తల్లిదండ్రులు సైదులు, పద్మ మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నారని రేణుక ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదుచేసింది. తనకేం జరిగినా పూర్తి బాధ్యత వాళ్లదే అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబు తెలిపారు.



పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లేఖను చూపిస్తున్న రేణుక

బేతవోలుకు మలక్‌పేట పోలీసులు?

చిలుకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మలక్‌పేటలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చందునాయక్ హత్య కేసును విచారిస్తున్న పోలీసులు గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలానికి వచ్చినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. హత్యోదంతంలో నిందితులుగా ఉన్న వారు చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చినట్లుగా తెలిసింది. వారిని గాలిస్తున్న మలక్‌పేట పోలీసులు స్థానిక పోలీసుల సహాయంతో పట్టుకునేందుకు బేతవోలుకు రాగా అప్పటికే వారు గ్రామం నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. వారి బంధువులను విచారించగా సాధారణంగా బంధువులు కావటంతో తమ ఇంటికి వచ్చారని, ఉదయాన్నే వెళ్లిపోయారని చెప్పడంతో మలక్‌పేట పోలీసులు వెనుతిరిగిరినట్లు తెలుస్తోంది.

అనుమతి లేకుండా కలపరవాణా చేస్తే కఠినచర్యలు

హుజూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా మామిడి చెట్లతో పాటు ఇతర కలపను రవాణా చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అటవీ క్షేత్ర అధికారి ఎస్ ఆనందరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అటవీ శాఖ నుంచి ఎన్‌వోసీ పొందిన తరవాతనే కలప రవాణా చేయాలని పేర్కొన్నారు. కొందరు దళారులు రైతుల తోటలలో చెట్లను అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నామని చెప్పి ఎలాంటి అనుమతి లేకుండా రవాణా చేస్తున్నారన్నారు. కొన్నిచెట్లకు మాత్రమే రుసుం చెల్లించి ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు తాము తొలగించుకోదలచిన చెట్లకు టీజీఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఫీజు చెల్లించి తొలగించుకోవాలని కోరారు. ఎన్‌టీపీఎస్ నుంచి ఎన్‌వోసీ తీసుకొని కలప రవాణా చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా కలపను తరలించే రైతులపై తెలంగాణ రాష్ట్ర అటవీ చట్టం 1967, వాల్టా యాక్టు 2002 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమంపై ఎవరికైనా సందేహాలు ఉన్నా, సలహాల కోసం అటవీశాఖ సిబ్బందిని సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

రోడ్డు పనులు అడ్డుకున్న రైతులు

హుజూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో రోడ్డు పనులను రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. వేపలసింగారం నుంచి కందిబండ వరకు రూ.2.3 కోట్లతో మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. కాగా కాంట్రాక్టర్ రోడ్డు పనుల కోసం పొలాల్లో గుంతలు తీసి మట్టిని తరలిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. మట్టిని తీస్తున్న ఎక్స్‌కవేటర్లను అడ్డుకున్నారు. దీంతో రైతులకు, పనులు చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా రైతుల పట్టా పొలంలో సుమారు 10 అడుగుల లోతు గుంతలు తీసి మట్టిని తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. పొలాల్లో గుంతలు పూడ్చాలంటే ఎకరానికి రూ.20వేలు ఖర్చవుతుందని ఆందోళన చేశారు. కార్యక్రమంలో రైతులు ఆదూరి నగేష్, రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనినవాసరెడ్డి, యలమంద, నాగరాజు, శ్రీనివాసు, శంభిరెడ్డి, సోమిరెడ్డి, సావిత్రమ్మ, లక్ష్మమ్మ, బండారు గోపి, చింతిర్యాల శ్రీనివాసు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుంటున్న రైతులు

'అభ్యుదయ' సేవ



తాటిపాముల గ్రామంలో చెక్ అందజేస్తున్న యూత్ సభ్యులు

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలోని అభ్యుదయ యువజన సమైక్య యూత్ సామాజిక సేవలో ముందుకు సాగుతూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. 1999లో 25 మందితో మొదలైన సమైక్య ప్రస్తుతం 150 మందికి చేరింది. గ్రామంలోని ఏ పేదవారికి కష్టం వచ్చినా మేమున్నామంటూ సభ్యులు అండగా నిలుస్తున్నారు. అంతేకాకుండా గ్రామ అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి రూరల్)

యువజన సమైక్య యూత్ సామాజిక, పర్యావరణ అంశాలపై కృషి చేస్తోంది. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువుకు తోడ్పాటు అందించడం, ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేలా అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వచ్చినా యూత్ సభ్యులు తలా కొంతడబ్బు వేసుకొని ఆ కుటుంబానికి అండగా ఉంటున్నారు. యూత్ వ్యసనాలకు ఆకర్షితులకు కాకుండా గ్రామంలోని యువకులు సామాజిక అంశాలపై మక్కువ చూపుతుండటం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒకప్పుడు చదువు- వెలుగు కార్యక్రమం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ గ్రామం నుంచి ప్రారంభమైంది. ఇక్కడి నుంచే రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్లు, కళారూపాల సారథులుగా ఎదిగారు. 400 మంది కళాకారులు ఉన్న ఈ గ్రామంలో ఏ పేదకు ఇబ్బందివచ్చినా ఆదుకోవడం ఆదర్శంగా నిలుస్తోంది.

ప్రతీ ఒక్కరికీ అవకాశం

సమైక్య యూత్‌లో బాధ్యతలను అందరికీ వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతీ ఏడాది సంక్రాంతి మరుసటి రోజు గ్రామంలో సమావేశమవుతారు. గత ఏడాది అధ్యక్ష, ఉపాధ్య, కార్యదర్శి, కోశాధికారితో పాటు కమిటీ సభ్యులందరూ కమిటీ నుంచి వైదొలుగుతారు. ఇతరులకు అవకాశం కల్పిస్తారు. దీంతో సంఘంలోని ప్రతీ సభ్యుడికి ఏదో సందర్భంలో బాధ్యత అనేది రావడం వల్ల సమైక్య పట్ల గౌరవం పెరుగుతుంది.



విజేతలకు బహుమతుల అందిస్తున్న సభ్యులు

అండగా నిలిచారు



నా భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. యువజన సమైక్య యూత్ సభ్యులంతా అండగా నిలిచారు. నా కుమార్తె పేరు మీద రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి నా కుటుంబానికి అండగా నిలిచారు. వారికి నా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. ఇలా యువకులంతా కలిసి గ్రామంలోని పేదలను ఆదుకోవడం అభినందనీయం.

-కారుపోతుల లాస్య, గ్రామస్థురాలు.

ఒక్కతాటిపై ఉంటాం



సమైక్య 1999లో 25మందితో ఏర్పాటైంది. నాటి నుండి నేటి వరకు పార్టీలకు అతీతంగా ఉంటూ, గ్రామ యువకులంతా ఒక్కతాటిపై ఉంటాం. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ ఆదర్శంగా ఉంటున్నా

- రేగుల మహేందర్, అభ్యుదయ యువజన సమైక్య యూత్ అధ్యక్షుడు.

ఎన్నోకుటుంబాలకు ఆసరాగా నిలిచాం



గ్రామంలోని పేద వారు ఎవరు మృతి చెందినా, అంగవైకల్యం చెందినా యూత్ సభ్యులం వెంటనే స్పందించి ఆర్థికసహకారం చేస్తూ ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచాం. ఆ కుటుంబంలో జరిగిన నష్టాన్ని బట్టి ఆ కుటుంబానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తాం. ఇలా సేవ చేయడంలో ఎంతో ఆనందాన్ని పొందుతున్నాం. ఈ మధ్య కాలంలో భూమి, జాగ లేని కుటుంబయాజమాని మృతి చెందడంతో అతడి కుమార్తె పేరు మీద పోస్టాఫీసులో రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆసరాగా నిలిచాం

- దయాయాదవ్, మాజీ అధ్యక్షుడు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

చౌటుప్పల్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద శుక్రవారం చౌటుప్పల్ పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్, మారణాయుధాల సరఫరాపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.



చౌటుప్పల్ సమీపంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి / రామన్నపేట : రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామం నుంచి కవాడిపల్లి గ్రామం వరకు పోలీసులు నాకాబందీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాములు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రతీ వాహనదారుడు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు కోరారు. రామన్నపేట పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద శుక్రవారం నాకబందీ చేపట్టారు. సరియైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 10 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ డీ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

నకిరేకల్‌లో గంజాయి ముఠా అరెస్టు

● 10 మంది రిమాండ్

● పరారీలో ముగ్గురు

నకిరేకల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ, తాగుతున్న పది మంది ముఠాను నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. నకిరేకల్ శివారులోని సాయిప్రియ హోటల్ వెనుక గడ్డివాము పక్కన ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నార్న సమాచారం మేరకు గురువారం తనిఖీలు చేసి 10మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, నకిరేకల్‌కు చెందిన కిషోర్‌టండన్ స్థానికంగా ఉన్న డెయిరీఫాంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ గంజాయి పీల్చేందుకు అలవాటు పడ్డాడు. డబ్బులు అధికంగా సంపాదించాలనే ఆశతో ఒడిశా రాష్ట్రానికి చెందిన గోల్నాక వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నకిరేకల్ రైస్‌మిల్లులో పనిచేస్తున్న వారికి విక్రయించాడు. మిల్లులో పని చేసే వారితో పాటు నకిరేకల్‌కు చెందిన వారికి విక్రయించాడు. మిల్లులో పనిచేస్తున్న అర్జున్‌కుమార్, అనిల్ మన్నన్, అబ్బు, వికాస్‌లు ఒకొక్కరికి 500 గ్రాముల చొప్పున, నకిరేకల్‌కు చెందిన క్రాంతి, సంతు, అఖిల్ రెడ్డి, సియాం, శ్రీకాంత్, నాగేందర్ మరికొంత మందికి 50 గ్రాముల ప్యాకెట్లను అమ్మినట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 13 మందిలో 10మందిని అరెస్టు చేశామని మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వారినుంచి 3.300 కిలోల గంజాయిని పట్టుకున్నామని, వాటి విలువ రూ.83 వేలు ఉంటుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ లచ్చిరెడ్డి, పోలీసు సిబ్బంది వై.వెంకటేశ్వర్లు, సుధాకర్, ఎం.సురేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నకిరేకల్‌లో గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

గంజాయి సేవిస్తున్న ముగ్గురి రిమాండ్

తిరుమలగిరి(సాగర్), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గంజాయితో పట్టుబడిన ముగ్గురిని నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రం శివారులో కొందరు గంజాయి సేవిస్తున్నారని సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లామన్నారు. చందూరు మండలం కోటయ్యగూడెం గ్రామానికి చెందిన శివరాత్రి దుర్గాప్రసాద్, తిరుమలగిరి గ్రామానికి చెందిన వరికుప్పల దిలీప్‌కుమార్, వరికుప్పల ప్రశాంత్‌లతో పాటు చిలకాపురం గ్రామానికి చెందిన తుడుం ధనుంజయలు గంజాయి సేవిస్తున్నారని తెలిపారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ధనుంజయ్ పారిపోయాడని, మిగతా ముగ్గురు నుంచి 96 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక బాంగ్ బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల విచారణ సందర్భంగా మండలంలో 10 మంది వరకు గంజాయి సేవించే వారున్నట్లు గుర్తించామన్నారు. వారిని కౌన్సెలింగ్ కేంద్రానికి పంపిస్తామని ఆయ తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, రవాణా చేసినా వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిందితులను నిడమనూరు కోర్టులో రిమాండ్‌కు పంపించామన్నారు.

భువనగిరిలో రెండిళ్లలో చోరీ

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట జిల్లాకేంద్రం భువనగిరి పట్టణ హౌసింగ్ బోర్డులో శుక్రవారం తెల్లవారుజామున రెండిళ్లలో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. మూడో ఇంటిలో చోరీకి యత్నించారు. దొంగల కదలికలు సీసీ కెమెరా ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. భువనగిరి రూరల్ హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న ఇంటిలో అద్దెకు ఉంటున్న మోటకొండూరు ఎంపీడీవో ఇందిర ఇంటికి తాళం వేసి ముందురోజు ఊరికి వెళ్లింది. ఇదే దొంగలు ఇంటి తాళం పగులగొట్టి రూ.5లక్షల విలువైన 5 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. అదే బస్తీలోని వెంకట్‌రెడ్డి ఇంటిలోకి కూడా ఇదేతరహాలో ప్రవేశించి రూ.40వేల నగదును అపహరించారు. మరో ఇంటిలో చోరీకి ప్రయత్నించినా ఫలించలేదు. చోరీలు జరిగినట్లు గమనించిన బాధితులు పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసు అధికారులు సంఘటనా స్థలాలను సందర్శించి ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దొంగలు ఎంపీడీవో ఇంట్లో చిందరవందరగా వేసిన వస్తువులు

● జనగాం జిల్లాలో చిట్యాల వాసి చోరీలు



జనగాం జిల్లా నెక్కొండ పోలీసుస్టేషన్‌లో నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నెక్కొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి):తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు జనగాం జిల్లా నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరెడ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బిర్రు రమేశ్‌బాబు జల్సాలకు అలవాటుపడి ఇటీవల నెక్కొండ, జనగామ పట్టణాల్లోని ఇళ్లలో చోరీలకు పాల్పడుతుండగా అతడిని పోలీసులు పట్టుకున్నారన్నారు. నెక్కొండకు చెందిన బండారు కొమురయ్య ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడు 1.2 తులాల బంగారు నగలు, 33 తులాల వెండి వస్తువులను చోరీ చేసినట్లు తెలిపారు. అలాగే జనగామ ప్రాంతంలోని పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి 6.6 తులాల బంగారు నగలు, 65 తులాల వెండి వస్తువులు దొంగిలించగా నిందితుడు నుంచి రికవరీ చేశామన్నారు. నిందితుడిని పట్టుకున్న నెక్కొండ ఎస్ఐ మహేందర్, హెచ్‌సీ అక్బర్‌పాషా, పీసీలు బీ రమేశ్, సాంబయ్య, స్వామి, సీసీఎస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కనగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలం ఇరుగంటిపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇరుగంటిపల్లి గ్రామానికి చెందిన బొప్పిడి సత్తిరెడ్డి (79) రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం నాటు వేయించేందుకు ఉదయం 8 గంటల సమయంలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. తండ్రి ఇంటికి రాకపోవడంతో కుమారుడు జానిరెడ్డి ఉదయం 11గంటలకు పొలం వద్దకు వెళ్లాడు. సత్తిరెడ్డి పొలంలో విగతజీవిగా పడిపోయి కనిపించాడు. కుడిచేతికి సర్వీస్ వైర్ తగిలి ఉండటాన్ని గమనించి విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. అనంతరం వారు అక్కడికి చేరుకుని విద్యుత్‌సరఫరాను నిలిపివేసి సత్తిరెడ్డిని నల్లగొండ ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు జానిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుడు సత్తిరెడ్డికి భార్య లక్ష్మమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఇసుకను డంప్ చేసిన వ్యక్తిపై కేసు

అడ్డగూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు ఎస్ఐ వెంకట్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన కూటికంటి రమేష్ ఇంటి వద్దకు పోలీసులు వెళ్లి అక్కడ పరిశీలించారు. ఇసుకను డంప్ చేసి ఆక్రమంగా తరలించడానికి ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఎస్ఐ తెలిపారు. అదే గ్రామానికి చెందిన బండి సాయి కుమార్ చిర్రగూడూరు బిక్కేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా చుట్టుప్రక్కన గ్రామాలకు ఇసుకను అక్రమంగా రవాణా చేసున్నారని ఎస్ఐ తెలిపారు. డంప్ చేసిన 24 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని, సుమోటగా కేసు నమోదు చేసినట్ల ఎస్ఐ తెలిపారు.

ప్రైవేట్‌లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ ఆ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి

సూర్యాపేటఅర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23న వామపక్షవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువస్తామని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు పిడమర్తి భరత్, పులుసు శ్రవణ్, దూదిపాళ ప్రవీణ్, మందిడి శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఔదార్యం..చెర్వుకు 'జలమార్గం'

- గోపలాయపల్లి వద్ద కాల్వ తవ్వేందుకు రైతుల అంగీకారం
- ప్రాజెక్టు అధికారుల సూచనతో మొదలైన కాల్వ తవ్వకం



రైతుల భూముల్లోంచి తవ్వుతున్న పైప్‌లైన్

నార్కట్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి..రోహిణి కార్తెలో కూడా ఇంతటి ఎండ లేదు...నార్కట్‌పల్లి అసలే వర్షాధారిత వ్యవసాయం జరిగే ప్రాంతం...ఆపై భూ గర్భ జలాలు అడుగంటాయి. నెల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాల జాడ లేదు. వేసిన పత్తిపంట...నాటేసిన వరి నారుమళ్లు నీటి కోసం నింగి వైపు చూస్తున్నాయి. వర్షం కురిసేటట్టు లేదు...చేను తడిచేటట్టు లేదు. ఇక ఆ రైతుల ముందు 'ఉదయించి'న ఏకైక మార్గమల్లా బీ.వెల్లెంల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించుకోవడమొక్కటే. రిజర్వాయర్ ప్రధాన ఎడమ కాలువ ద్వారా నీటిని నార్కట్‌పల్లి చెర్వుకు అక్కడి నుంచి ఎం.ఎడవల్లి, ఏపీలింగోటం చెర్వులకు చేర్చాలి. కానీ ప్రధాన కాలువ నుంచి మైనర్ కాల్వ తవ్వి చెర్వులోకి నీరు తీసుకురావాలంటే మహేశ్, నరేశ్, శ్రీకాంత్ అనే రైతులకు చెందిన భూముల నుంచే తవ్వాలి. దీంతో ఇక్కడి అధికార పార్టీ నాయకులు ఆ రైతులను సంప్రదించారు. ఆ రైతులు కూడా పెద్ద మనసు చేసుకుని ఔదార్యం చూపారు. దీంతో చెర్వులోకి నీరు వచ్చేలా మైనర్ కాల్వ తవ్వకం పనులు శుక్రవారం బీ.వెల్లెంల ప్రాజెక్టు ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు సమక్షంలో మొదలయ్యాయి. రైతుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సామ నరేందర్‌రెడ్డి, గాలి నర్సింహ్మా, తుపాకుల వెంకన్న, ప్రాజెక్టు డీఈఈలు విఠల్, మారం శ్రీనివాస్, ఏఈ నవీన్‌కుమార్ ఉన్నారు.

కల్లు దుకాణాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

తెలంగాణ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జానయ్యగౌడ్

కనగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణాల ఎత్తివేత నిర్ణయాన్ని అధికారులు విరమించుకోవాలని తెలంగాణ కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొర్పునూరి జానయ్యగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కల్తీ కల్లు తయారు చేసిన బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరో ఒక్కరు చేసిన తప్పుకు అందరికీ అంటగడుతూ అధికారులు కల్లు దుకాణాలన్నింటినీ ఎత్తివేసే చర్యలు చేపట్టడం సబబు కాదన్నారు. హైదరాబాద్ పరిధిలో సుమారు 500వరకు కల్లు దుకాణాలుండగా వాటి ద్వార వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కల్లు దుకాణాలను రద్దు చేస్తే వారంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ప్రమాద వశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలన్నారు.

అందరికీ చేనేత భరోసా ఇవ్వాలి

నల్లగొండ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జియో ట్యాగ్ కలిగిన అందరికీ చేనేత భరోసా ఇవ్వాలని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ ఈనెల 22, 23, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుటధర్నాలు నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత భరోసా పథకం ద్వారా జియో టాక్ వేసిన ప్రతి మగ్గానికి ఎలాంటి షరతులు లేకుండా చేనేత కార్మికుడికి, అనుబంధ వృత్తుల కార్మికులకు చేనేత భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారులు వెంటనే ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ కార్మికులకు రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత కేంద్రాలలో సబ్సిడీతో నూలు డిపోలు ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు అందించాలని కోరారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేనేత, పవర్ లూమ్ కార్మికులందరూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి ప్రభుత్వానికి కలెక్టర్ల ద్వారా వినతిపత్రాలు పంపాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంజి నాగరాజు, దండెంపల్లి సత్తయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్ పాల్గొన్నారు.

ఎల్లమ్మను దర్శించుకున్న ఏసీ భాస్కర్



అమ్మవారి ఆలయంలో ఏసీ భాస్కర్

కనగల్, జూలై 18: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని శుక్రవారం జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.భాస్కర్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఏసీకి అర్చకులు వేద ఆశీర్వచనాలను, తీర్థప్రసాదాలను అందజేసారు. ఏసీ వెంట ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సుమతి, ఆలయ సిబ్బంది తదితరులున్నారు.

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆ కళాశాల ఒక వ రం లాటింది. ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు తమ అదృష్టంగా భావిస్తారు. విద్యా రంగంలోనే ఘన కీర్తిని చాటుతున్న నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల 70వ వసంతంలోకి అడుగిడుతోంది. 1956వ సంవత్సరంలో ప్రారంభమైన ఎన్జీ కళాశాల స్థాపక దినోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన నిర్వహించేందుకు, ప్లాటినం వేడుకలను నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



విద్యా రంగంలో ..

ఎన్జీ కళాశాల ఘన కీర్తి

- 183 దేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు
- 27రకాల కోర్సులతో దినదిన ప్రవర్ధమానం
- తెలంగాణ టాప్ -3 స్థానంలో కళాశాల
- ఈ నెల 22న 70వ వసంతంలోకి అడుగిడుతున్న వేళ
- ప్లాటినం వేడుకలకు సర్వం సిద్ధం

ఎన్జీ కళాశాలలో డిగ్రీతో పాటు పీజీ కోర్సులు ఉన్నాయి. 27రకాల కోర్సులతో దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతోంది. ఆరు పీజీ కోర్సులతో కొనసాగుతోంది. బీఎస్సీ, బీఏ, బీకాంలతో పాటు బీసీఏ, బీబీఏ వంటి అదనపు కోర్సులు ఉండగా ఆయా విభాగాల్లో మొత్తం 1560 సీట్లు ఉన్నాయి. అదనంగా కోర్సుల్లో మరో 2500మంది వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఎన్జీ కళాశాలకు విశాలమైన క్రీడా మైదానంతో పాటు నూతన తరగతి గదులు, ఆధునాతనమైన ప్రయోగశాలలు, అతిపెద్ద గ్రంథాలయం వంటి సౌకర్యాల ఉన్నా యి. ఈ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన చేయడంతో ఏటా విద్యార్థులు ఆయా కోర్సుల్లో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఆయా రంగాల్లో రాణించడానికి వేదికగా మారింది. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలను కూడా నిర్వహిస్తూ విద్యార్థులను సమాజ సేవలో భాగస్వామ్యులను చేయడంలో అధ్యాపకుల పాత్ర ఎంతగానో ఉంది. గ్రంథాలయాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడంతో పాటు సుమారు 60వేలకు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అకాడమిక్‌తో పాటు పీజీ ఎంట్రన్స్, పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు రీడింగ్ హాల్‌లో అందుబాటులో ఉన్నాయి.

1956వ సంవత్సరంలో ఎన్జీ కళాశాల స్థాపన

1956వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చేతుల మీదుగా బీఏ కోర్సులో 90 మంది విద్యార్థులతో ప్రారంభమై 69 వసంతాలు పూర్తి చేసుకుని 70 వసంతంలోకి అడుగిడి ప్లాటినం వేడుకలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం అన్ని గ్రూపులు, కోర్సు లు కలిపి నాలుగు వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసించడం విశేషం. ఎన్జీ కళాశాలలో గత 69సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు అనేక మంది 183 దేశాలల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. అఖిల భారత సర్వీసులతో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా ఎంతో మంది రాణిస్తున్నారు. ప్ర స్తుతం ఉన్న పాత భవనం శిథిలావస్థకు చేరి కూలిపో యే దశలో ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.36కోట్లు విడుదల చేయడంతో నూతన భవనాన్ని నిర్మించారు. అందులో తరగతుల నిర్వహణ కొనసాగుతోంది.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బంగారు పతకాలు

నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 23 సంవత్సరాలుగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నారు. కళాశాల పూర్వ ప్రధా న చార్యులు భాస్కర్‌రావు, విద్యార్థుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.లింగయ్య కలిసి ఈ సంవత్సరం సుమారు రూ.10.50లక్షలు కళాశాల కు అందజేయడంతో ఈ విద్యా సంవత్సరం కూడా బం గారు పతకాల కార్యక్రమాన్ని కళాశాల చేపట్టింది. ఈనెల 22న జరిగే ప్లాటినం వేడుకల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్నారు. ఇంకా ఎవరైనా ఔత్సాహికులు ఉంటే లక్ష 50వేలు కళాశాలలో డిపాజిట్ చేస్తే వారి పేరు మీద లేదా వారు సూచించిన వారి పేరు మీద ప్రతి ఏటా బంగారు పతకాలను అందజేస్తారు. ఈ మేరకు కళాశా ల తరఫున విరాళాలు అందజేయాలని కోరుతున్నారు.



1956 సంవత్సరం జూలై 22న ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభమైన ఎన్జీ కళాశాల (ఫైల్)

అమెరికా పోర్టులాండ్ యూనివర్సిటీలో పూర్వ విద్యార్థులు

అమెరికాలోని ఓరేగాన్ రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద పోర్టులాండ్ యూనివర్సిటీలో ఎన్‌జీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు అనేక మంది పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్స్‌గా పనిచేస్తూ ఎన్జీ కళాశాల ప్రతిష్టను దేశ విదేశాల్లో నిలబెట్టారని చెప్పవచ్చు. పోర్టులాండ్ నగరంలో ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయం ఈ పోర్టులాండ్ స్టేట్ (పీఎస్‌వో) యూనివర్సిటీ ఇందులో ఎన్జీ కళాశాల పూర్వ విద్యార్థులు రాణిస్తున్నారు. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ రాష్ట్రంలోనే టాప్ -3 స్థానంలో ఉంది. అడ్మీషన్ల పెరుగుదల విషయంతో పాటు విద్యార్థులు ఉన్నత స్థితికి చేరడం వల్ల కళాశాలకు మంచి స్థానం ఉందని చెప్పవచ్చు. ఈ కళాశాల స్థాపక దినోత్సవానికి ప్రముఖులతో పాటు పూర్వ విద్యార్థులు హాజరు కానున్నారు.

ఎన్‌జీ కళాశాల ప్రతిష్ఠాత్మకమైనది



నేను ఎన్జీ కళాశాల పూర్వ విద్యార్థిని. ఇదే కళాశాలలో డిగ్రీ పూర్తి చేను. ఈ కళాశాలలోనే విద్యాబోధనం చేయడం నాకు ఆనందంగా ఉంది. ఈ కళాశాల ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేస్తున్నాం. ఎంతో మంది పూర్వ విద్యార్థులు అత్యున్నత రంగాలకు ఎదిగారు. ప్రస్తుతం అనేక మంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారందరినీ చూస్తే ఎంతో గర్వంగా ఉంటుంది. కళాశాల ప్లాటినం వేడుకలను విజయవంతం చేయాలి.

- బి.నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ మైక్రోబయాలజీ, ఎన్జీ కళాశాల

ఎంతో మంది అత్యున్నత స్థానాల్లో ఉన్నారు



ఎన్జీ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు అత్యున్నత స్థానాలకు ఎదగడం ఎంతో గర్వకారణం. 69సంవత్సరాలు పూర్తి చేసుకుని 70వ వసంతంలోకి అడుగిడుతోంది. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు అమెరికాలోని పోర్ట్‌లాండ్ యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్స్‌గా రాణిస్తున్నారు. అది ఎంతో సంతోషించదగ్గ విషయం. ఈకళాశాల తెలంగాణలోనే టాప్-3స్థానంలో ఉంది.

- టి.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కెమిస్ట్రీ, ఎన్జీ కళాశాల

183 దేశాల్లో రాణించడం సంతోషదాయకం



నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన అనేక మంది పూర్వ విద్యార్థులు 183 దేశాల్లో వివిధ రంగాలల్లో పనిచేయడం సంతోషాన్ని ఇస్తోంది. అఖిల భారత సర్వీసుతో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఎన్జీ కళాశాల స్థాపన దినోత్సవాన్ని ఈ నెల 22న నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యా యి. స్థాపక దినోత్సవంలో బంగారు పతకాల ప్రదానోత్సవానికి ఎంజీయూ ఉపకులపతి అల్తాఫ్ ఖాజా హుస్సేన్ తో పాటు పలువురు హాజరవుతున్నారు. కార్యక్రమాన్ని విద్యార్థులు విజయవంతం చేయాలి.

- డాక్టర్ సముద్రాల ఉపేందర్, ప్రిన్సిపాల్, ఎన్జీ కళాశాల

విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంపొందించాలి

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి

బీబీనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, వర్చువల్ రియాలిటీ వంటి సౌకర్యాలను కల్పించి విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంపొందించేలా కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జీసీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నెలకొల్పిన ఇంటిగ్రేటెడ్ లైబ్రరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పుట్టిన గడ్డ, చదువుకున్న పాఠశాలపై మమకారంతో ఇక్కడి విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక ఎన్ఆర్ఐ పాఠశాలలో ఇంటిగ్రేటెడ్ లైబ్రరీని నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఇక్కడి సైన్స్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతికతపై ఆలోచనలు పెరిగేలా ప్రేరేపించి, వారితో సైన్స్ ప్రయోగాలను చేయించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కమిషన్ చైర్మన్ ఎదుట సైన్స్ ప్రయోగాలు చేయగా తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసుకుని విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట డీఈవో సత్యనారాయణ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు గోనారెడ్డి, కీర్తిరెడ్డి, జీసీఎస్ఆర్ ట్రస్టు ప్రతినిధి అరుణ్‌కుమార్, హెచ్ఎం బాలారెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి బుడ్డోడి ప్రపంచ రికార్డు

- 4.20 నిమిషాల్లో ప్రపంచ దేశాలు, వాటి రాజధానుల పేర్లు
- బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న తారక్ నంద

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన ఐదేళ్ల చిన్నారి చావా తారక్ నంద ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రెండోసారి చోటు సాధించాడు. స్థానిక ఆర్‌కే ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ చావా రాజ్‌కుమార్, డాక్టర్ చావా అశ్లేష దంపతుల కుమారుడైన ఒకటో తరగతి చదువుతున్న తారక్ నంద మేలో వీడియో రికార్డింగ్ ఆధారంగా జరిగిన పోటీల్లో ప్రపంచ దేశాలు, వాటి రాజధానుల పేర్లను 4 నిమిషాల 20 సెకన్ల వ్యవధిలో చెప్పి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇటీవలి వరకు యూరప్‌కు చెందిన ఐదేళ్ల బాలిక 5 నిమిషాలతో ఉన్న రికార్డులను తారక్ నంద ఛేదించాడు. ఈ మేరకు మూడు రోజుల క్రితం (ఈనెల 15వ తేదీన) ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు వివరాలను వెల్లడించారు. అయితే గతంలోనూ వంద దేశాల పేర్లు, వాటి రాజధానులను అనర్గళంగా చెప్పి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. ఈ మేరకు ప్రపంచ రికార్డు సృష్టించిన తారక్ నందను కలెక్టర్ ఎం.హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్ యాదవ్ అభినందించారు.



చావా తారక్ నందను అభినందిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో తారక్ తల్లిదండ్రులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ అశ్లేష

వైభవంగా సువర్ణ పుష్పార్చన, ఊంజల్ సేవోత్సవాలు



లక్ష్మీఅమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి దర్శనానంతరం మాడ వీధిలో బెంగాల్ అధికారులు

యాదగిరిగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి అర్చకుల వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 11,05,081 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రభుత్వ ఆహార, పౌరసరఫరాల అదికారులు ప్రణబ్ బిస్వాస్ (ప్రత్యేక కార్యదర్శి), సుప్రతిమ్, సునయ్ కుమార్‌గోస్వామి, దేబమాల్య బసు స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. యాదగిరికొండపై సుమారు (4 నుంచి 6 వరకు) 2 రెండు గంటల పాటు 58.8మిల్లీ మీటర్ల భారీ వర్షం కురిసింది.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణాన్ని వేదపండితులు శుక్రవారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం హోమాధికాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని వృథా చేయొద్దు



నీటిని విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చిన మూసీ సాగునీటిని వృథా చేయవద్దని ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయకట్టు రైతులకు సూచించారు. మూసీ ప్రాజెక్టు కుడి ప్రధానకాల్వకు శుక్రవారం ఆయన వానాకాలం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూమూసీ ప్రాజెక్టులో పూడిక తొలగింపుతో పాటు ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధులు సాధించేందుకు యత్నిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ వెంకటరమణ, మూసీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల, తహసీల్దార్ రమాదేవి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఏఈ మధు, ఏఈ మమత, కె.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

రెయిన్‌గేజ్‌ల నిర్వహణ ఇలాగేనా?

- పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మన మాటున..
- రక్షణగోడలు లేకపోతే ఎలా?

భువనగిరి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా వర్షాపాతాన్ని లెక్కించే రెయిన్ గేజ్‌ను భువనగిరి జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు, చెట్టు కొమ్మల మాటున ఏర్పాటు చేయడంతో వర్షాపాత నమోదులో తారతమ్యాలు జరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. భువనగిరి మండలం నందనం గ్రామ శివారులో ఎలాంటి రక్షణ లేకుం డా రేయిన్ గేజ్ మిషన్ ఏర్పాటు చేయడం, చిన్నారులు రెయిన్ గేజ్ మిషన్ స్తంభాన్ని అటు ఇటు కదిలిస్తుండడంతో వర్షపాత నమోదులో పారదర్శకత ఉండడం లేదు. భవనాలు, చెట్టు లేని విశాలమైన ఖాళీ ప్రదేశాల్లో లేదా ఎత్తైన భవనాల మీద రెయిన్ గేజ్‌లను ఏర్పాటు చేసి రక్షణగా దాని చుట్టూ ఇనుప కంచెను నిర్మించాల్సి ఉండగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని నందనం సబ్ స్టేషన్ ఆవరణలో రెయిన్ గేజ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే రేయిన్ గేజ్ పక్కన పిచ్చి మొక్కలు వేపుగా పెరగడంతో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు తెలిసీ తెలియక పరిసర ప్రాంతంలో మూత్ర విసర్జన చేస్తున్నారు. అదే విధంగా నందనం శివారులో బహిరంగ ప్రదేశంలో ఎలాంటి ప్రహరీ నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా రెయిన్ గేజ్‌ను ఏర్పాటు చేయడం వల్ల పశువులు, కుక్కలు సంచరిస్తు రెయిన్ గేజ్ యంత్రాన్ని కదిలిస్తే వర్షాపాత నమోదులో కొంత మేర మార్పులు చేకూరే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటు న్నారు. రెయిన్ గేజ్ యంత్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశంలో రక్షణగా ప్రహరీ ఏర్పాటు చేసి వర్షపాతం లెక్కించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మండల సహాయ స్టార్టికల్ అధికారి బాలనర్సింహను వివరణ కోరగా తమ దృష్టికి ఇప్పుడే వచ్చిందని రెయిన్ గేజ్ పరిసరా ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు నందనం శివారులోని రెయిన్ గేజ్ ఏర్పాటు చేసిన స్థలంలో ప్రహరీ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు.



భువనగిరి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కల మధ్య రెయిన్ గేజ్



నందనం శివారులో రక్షణగోడ లేకుండా ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్

ప్రహరీ నిర్మించాలి



వర్షపాతాన్ని పారదర్శకంగా లెక్కించేందుకు జిల్లా ప్రణాళిక అధికారులు ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్‌ల వద్ద ప్రహరీ నిర్మించాలి. ఎలాంటి రక్షణ లేకపోవడం, పిచ్చి మొక్కలు, చెట్టు కొమ్మలు అడ్డు ఉండడంతో వర్షం పడినప్పుడు వర్షపాత నమోదులో తారతమ్యం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి రెయిన్ గేజ్ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

-కొండాపురం మనోజ్‌కుమార్, నందనం గ్రామం, భువనగిరి మండలం

మామిడి చెట్లను అక్రమంగా నరికేవారిపై చర్యలు

హుజూర్‌నగర్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మామిడి చెట్లను అక్రమంగా నరికేవారిపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డివిజన్ ఫారెస్ట్ అధికారి ఆనందరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది దళారులు రైతులను మోసం చేసి కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. మామిడి తోటలు తొలగించాలంటే రైతులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు.

పరిశుభ్రతలో రాజీ పడొద్దు

సూర్యాపేటటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు పరిశుభ్రతలో ఎలాంటి రాజీ పడొద్దని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి అన్నారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని 41వవార్డులో ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, నాయకులు షఫీవుల్లా, ఆయుబ్‌ఖాన్, లింగయ్య, ఏఈ తిరుమలయ్య, శ్వేత, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భానుపురి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట టౌన్-2లో విద్యుత్ లైన్లను మరమ్మతు చేస్తున్నందున పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ యశ్వంత్ ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్, గణేష్‌నగర్, శ్రీశ్రీనగర్, హైటెక్ బస్‌స్టేషన్ వెనుక విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీడీవోగా ఇషాక్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ

కోదాడ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి: కోదాడ ఎంపీడీవోగా ఎండీ ఇషాక్ హుస్సేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలం నుంచి కోదాడ మండలానికి బదిలీపె వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

తిరుమలగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. శుక్రవారం ఎంఈవో శాంతయ్యతో కలిసి మునిసిపల్ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, మోడల్ స్కూల్ హాస్టళ్లను తనిఖీ చేశారు. కిచెన్, ఆహార పదార్థాలు, రికార్డులు, ఫిర్యాదుల పెట్టెలను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వీరి వెంట డీటీ జాన్‌మహ్మద్, ప్రిన్సిపాల్ సంజీవ ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మఠంపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరతారని ఎంఈవో వెంకటాచారి అన్నారు ఒత్తిడిని విడి విజయం వైపు నడవాలని కోరుతూ శుక్రవారం మండలంలోని బక్కమంతులగూడెం గ్రామ పరిధిలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో జరిగి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లైఫ్ స్కిల్స్, విద్యార్థుల భవిష్యత్, ఒత్తిడిని జయించడం అనే అంశాలపు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్లు అపోహలకు గురికావొద్దు

సూర్యాపేట అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఎస్‌టీవో కార్యాలయంలో ఫిజికల్ సర్టిఫికెట్, ఆధార్ పాన్‌కార్డులు ఇవ్వాలనే వార్త అసత్యమని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల అధ్యక్షుడు దండశ్యాంసుందర్‌రెడ్డి, కార్యదర్శి సుధగాని నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో ఉన్న 75ఏళ్ళ పైబడిన పెన్షనర్లు, ఫిజికల్ సర్టిఫికెట్లు, ఆధార్, పాన్ కార్డులు డీటీవో కార్యాలయం ఇవ్వాల్సి ఉంటుందని జిల్లా పెన్షనర్లకు అవసరం లేదన్నారు. జిల్లాలోని పింఛనర్లు అపోహలకు గురికావొద్దని ఆయన సూచించారు.

సమస్యలకు నిలయంగా గ్రామ పంచాయతీలు

● అధ్వానంగా రహదారులు ● అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

మఠంపల్లి మండలంలోని పలు పంచాయతీలు సమస్యలకు నిలయంగా మారాయి. విద్యుత్, తాగునీటి సమస్యలు ఉన్నాయి. మరుగుదొడ్లు లేవు. డ్రైనేజీ సీసీ కాల్వలు లేనందున పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామలు, తండాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.
- (ఆంధ్రజ్యోతి - మఠంపల్లి)

మఠంపల్లి మండలంలో గతంలో 16 పంచాయతీలు ఉండగా కొత్తగా మరో 13 తండాలను పంచాయతీలుగా గుర్తించారు. ఈ 29పంచాయతీల్లో సమస్యలు ఉన్నాయి. మురుగుకాల్వలు, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని గ్రామాలకు పంచాయతీలకు భవనాలు ఉండగా, మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. కొన్నిటని అద్దె భవనాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంచాయతీ కార్యాలయాలను నిర్వహించారు. పలు పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించేందుకు గదులు ఇరుకుగా ఉన్నాయి. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్డి, నిర్మాణం లేనందున ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు ఇబ్బంది పడుతున్నారు.

సర్పంచ్ పదవీకాలం ముగిసి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఉన్నందునఅభివృద్ధి కుంటుపడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మఠంపల్లి మండలంలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

అధికంగా నిధులు కేటాయించాలి



మాది మండలంలో మారుమూల కృష్ణపట్టే ప్రాంతంలోని ఓ తండా పంచాయతీ. మా పంచాయతీకి ఆదాయం తక్కువ అయినందున ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అధిక నిధులు కేటాయించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి.

●బానోతు బాబునాయక్, భీల్యానాయక్‌తండా

పంచాయతీల్లో సౌకర్యాలు కల్పించాలి



గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలి. సౌకర్యాలు లేనందున అనేక ఇబ్బందులు పడుతున్నాం. తండాలు, గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీరు, పారి శుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి.

● బి.చందూలాల్, కొత్తదొనబండతండా

కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌తో రైతుల ఇబ్బందులు

తిరుమలగిరి రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌తో నెలన్నర రోజుల నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తొండ గ్రామంలో ఓడపెల్లి సోమనర్సయ్య బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ 45రోజుల క్రితం మరమ్మతుకు గురైంది. రైతులు ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా నెలరోజుల తర్వాత మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను అర్వపల్లికి తీసుకువెళ్లారు. వారం రోజుల తర్వాత మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొండ గ్రామానికి ఇచ్చారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సిబ్బంది అమర్చినా పనిచేయడం లేదు. దీనిపై రైతులు అధికారులను ప్రశ్నించగా.. మరోసారి తీసుకురండి.. చెక్ చేసి పంపిస్తామని అంటున్నారని తొండ గ్రామ రైతులు సారికొల్ల గణేష్, నాగమ్మ, అంజయ్యలు తెలిపారు. ఇప్పటికే పోసిన నారు ఎండే దశకు చేరిందని, మరోసారి ఎకరానికి రూ.2వేలు వెచ్చించి దున్నకం చేయించ లేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కేటాయించి, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



తొండ గ్రామంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

నట్టల నివారణ మందులతో జీవాలు ఆరోగ్యం



కోదాడలో జీవాలకు నట్టల నివారణ మందులను తాపించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నట్టల నివారణ మందులను తాపిస్తే జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. శుక్రవారం కోదాడలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు తాపించే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. నట్టల నివారణ మందుల కోసం రూ. 5లక్షలను శాఖకు అందజేసి, నియోజకవర్గంలో ఉన్న 2.50 లక్షల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాపించాలని ఆదేశించానన్నారు. ప్రతి సంవత్సరం రూ.15 లక్షల నిధులతో నాలుగు నెలలకోసారి నియోజకవర్గంలోని జీవాలలను నట్టల నివారణ మందులను తాపిస్తామన్నారు. కోదాడలోని ప్రాంతీయ పశువైద్యశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పశ ఔషధ బ్యాంక్‌ను పరిశీలించారు.బాలాజీనగర్ వాసి పుట్టగంటి రవికిరణ్ రూ. 25 వేల విరాళంతో ఏర్పాటు చేసిన పాడి పశువులకు నిత్యం కాల్షియం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఏఐసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ, వైస్ చైర్మన్ బషీర్, మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ ప్రమీల రమేష్, కోటేశ్వరరావు, పాల్గొన్నారు

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కోదాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఎమ్మెల్యే ఎన్.పద్మావతి అన్నారు. శుక్రవారం కోదాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాల మహిళా సమాఖ్య సభ్యులతో ఇందిరా మహిళా శక్తి సంబరాలు 2025 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. త్వరలో గోదాంలు, పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుచేసి, నిర్వహణ మహిళలకే అప్పగిస్తామన్నారు. కోదాడ నియోజకవర్గంలో 5050 సంఘాలు 51,900 మంది సభ్యులు ఉన్నారన్నారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్ మాట్లాడుతూ మహిళలకు ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు రూ.64 లక్షల సాయం అందిస్తామని తెలిపారు. త్వరలో మహిళలచే రూ. 1.20 కోట్ల రూపాయలతో పెట్రోల్ బంక్, రూ.15 లక్షలతో దాన్యం నిల్వ చేసేందుకు గోదాముల నిర్మాణం, సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు పెట్టుబడి సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని 232 మహిళా సంఘాలకు రూ.32.06 కోట్లు, 3862 మహిళా స్వయం సంఘాలకు రుణాలపై వడ్డీ రాయితీ కింద రూ. 12 కోట్ల 99 లక్షల 7 వేల విలువైన చెక్కును అందజేశారు. అంతకముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.85 కోట్ల 36 లక్షల 500 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు

ఇంటి పన్నులే ఆధారం

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టర్ అవతారాలు ఎత్తి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. సీసీరోడ్లు, మురుగు కాల్వలు, మంచినీటి ట్యాంకులను నిర్మించారు. సొంత డబ్బులతో పనులు చేయగా వాటికి ఇంకా బిల్లులు రాలేదు. జిల్లావ్యాప్తంగా రూ.7.6కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది.

ఎన్నికలు అయితేనే నిధులు

పంచాయతీ ఎన్నికలు ఎంతతొందరగా పూర్తయితే నిధుల మంజూరు కూడా వేగవంతమవుతుంది. కేంద, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉటుంది. అప్పటి వరకు గ్రామకార్యదర్శులదే భారం. సర్పంచ్ ఎన్నికలు పూర్తయితే ఎమ్మెల్యేలు కూడా గ్రామాలకు నిధులు కేటాయించే అవకాశం ఉంది. ఎన్నికలు నిర్వహించక ఆలస్యమవుతున్నా కొద్దీ అభివృద్ధి కుంటుపడుతుంది.

నిధులు చెల్లిస్తాం

ప్రభుత్వం నుంచి నిధులు రాగానే కాంట్రాక్టర్లకు నిధులు చెల్లిస్తాం. ఇప్పటికే రూ.7.6కోట్లు చెల్లించాల్సి ఉంది. 20మంది గ్రామకార్యదర్శుల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. వాటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం.

● యాదగిరి, డీపీవో

దొడ్డా నారాయణ నేటి తరానికి ఆదర్శప్రాయుడు



చిలుకూరులో దొడ్డా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి

చిలుకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు దొడ్డా నారాయణరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో దొడ్డా నారాయణ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారికి నివాళులర్పించారు. రాజకీయాలకు అతీతంగా ఆదర్శ శత్రువుగా రాష్ట్రస్థాయిలో దొడ్డా ప్రజలలో, నాయకులలో మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ముత్తవరపు పాండురంగారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణ, వరప్రసాద్‌రెడ్డి, కేఎల్ఎన్ ప్రసాద్, పువ్వాడ దుర్గాప్రసాద్, జాస్తి సుబ్బారావు, బజ్జూరి వెంకటరెడ్డి, నాగయ్య, కొండా కోటయ్య, దొడ్డా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డా నారాయణరావు ఆశయాలను సాధించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లంల యాదగిరి అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో దొడ్డా నారాయణరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్, శ్రీకాంత్, ఎండీ ఎక్బాల్, జంపాల మల్లయ్య, మనోజ్, సత్తయ్య, రవి, శ్రీను, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లోపం.. పేదలకు శాపం

(5వపేజీ తరువాయి)

ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించేలా ప్రోత్సహించాల్సి ఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో రోగులు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే ఆసుపత్రిలో ల్యాబ్, ఎక్స్‌రే, ఇతర విభాగాలకు వెళ్లే రూట్లకు సంబంధించిన మ్యాప్‌లు రోగులకు అర్థమయ్యేలా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

39 సెంటర్ల నుంచి...

జిల్లాలోని 39 ఆరోగ్య కేంద్రాల నుంచి రోజువారీగా అక్కడి నుంచి రోగుల శాంపిల్స్ సూర్యాపేటలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపిస్తుంటారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు(పల్లె, బస్తీ దవాఖానాలు)లకు వచ్చిన రోగులను పరీక్షించి వారికి ఉన్న వ్యాధిని నిర్ధారణ చేయడానికి బ్లడ్ శ్యాంపిల్స్ యూరిన్, ఇతర శ్యాంపిల్స్‌ను సేకరించి పంపిస్తున్నారు. ఇందుకోసం ఐదు వాహనాలను ఐదు రూట్లకు కేటాయించారు. రోజువారీగా జిల్లాలో 39 సెంటర్ల ద్వారా 900 నుంచి 1000 వరకు శాంపిల్స్ వస్తున్నట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆయా సబ్‌సెంటర్లకు, పీహెచ్‌సీలకు వెళ్లి పరీక్షలకు రక్త, మూత్ర, ఇతర నమూనాలు ఇస్తే పరీక్షలు చేసిన అనంతరం వైద్యులు ఔషధాలను ఇవ్వనున్నారు. దీంతో రోగులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండే అవకాశం ఉంటోంది.

ఐదు రూట్ల నుంచి జిల్లా కేంద్రానికి

జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రానికి ఐదు వాహనాల్లో శాంపిల్స్ వస్తుంటారు. మొదటి రూట్ వాహనం అర్వపల్లి, తిర్మలగిరి, నాగారం, తుంగతుర్తి, రావులపల్లి, మద్దిరాల, నూతనకల్, రెండో వాహనం కాసరబాద, రాజీవ్‌నగర్, గిరినగర్, అంబేద్కర్‌నగర్, చివ్వెంల, మోతె, కుడకుడ, మూడు వాహనం మేళ్లచెర్వు, మఠంపల్లి, లింగగిరి, హుజూర్‌నగర్, చిలుకూరు, రామాపురం బీడీకె, మగ్దుంనగర్, నాలుగో వాహనం కోదాడ సీహెచ్‌సీ, కోదాడ యూపీహెచ్‌సీ, కాపుగల్లు, అనంతగిరి, త్రిపురారం, నడిగూడెం, రేపాల, మునగాల, కొమరబండ, మాధవరంగూడెం, ఐదవ రూట్‌లో నేరేడుచర్ల, కలమలచెరువు, గరిడేపల్లి, పెంచికల్‌దిన్న, పెన్‌పహాడ్, పాలకవీడు ప్రాంతాలలో ఉన్న ఆసుపత్రుల నుంచి వాహనం వచ్చి రోజు శాంపిల్స్‌ను అందజేస్తుంది.

ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి నష్టపోవద్దు

ప్రభుత్వ వైద్యసేవలను పొందాలి. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దు. అన్నిరకాల పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నాం. సూర్యాపేటలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

- జనార్ధన్, ఆర్ఎంవో, సూర్యాపేట జిల్లా ఆసుపత్రి

ఘనంగా జగదీష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



సూర్యాపేటలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: మాజీ మంత్రి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని కనకదుర్గాదేవి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దీంతో పాటు పట్టణంలోని 9వ వార్డులో కేక్ కట్ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ మహిళా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బి. లింగయ్యయాదవ్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు గండూరి కృపాకర్ పాల్గొన్నారు.

● సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జగదీష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జీడీ భిక్షం, ఉప్పల ఆనంద్, నెమ్మాది భిక్షం, సంతోష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నేరేడుచర్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, డీసీసీబీ డైరక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, చెన్నబోయిన సైదులు, లకుమళ్ల జ్యోతిపాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ దేవాలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ జడ్పీవైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్, కసగాని లక్ష్మీబ్రహ్మంగౌడ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

● తుల్జారావుపేటలో మాజీ సర్పంచ్ దొంగరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జగదీష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే సామేలు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సామేలు

తిరుమలగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 14న తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో రాష్ట్ర వ్యాప్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంబిం చడం, తిరుమలగిరి మండలానికి దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు, జూనియర్ కాలేజీకి నిధులు, అడ్డగూడూరు, నాగారం మండలాల్లో ప్రభుత్వ కార్యా లయాలకు నిధులు మంజూరు చేసినందుకు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

పట్టణంలో మౌలిక వసతులు కల్పించాలి

హుజూర్‌నగర్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నేతలు పల్లె వెంకటరెడ్డి, నాగారపు పాండులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కు వారు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలని, డయాలసిస్, బ్లడ్‌బ్యాంక్, సీటీ స్కాన్‌లను ప్రారంభించాలని, సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలని, మోడల్ కాలనీలో ఇళ్లు పూర్తిచేసి పేదలకు పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గి బ్రహ్మం, పోసనబోయిన హుస్సేన్, శీలం శ్రీను, వీరమల్లు, మల్లయ్య, తిరపయ్య, వెంకటనారాయణ, నర్సింహాచారి, సాంబయ్య, వీరస్వామి, వెంకటి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి

నేరేడుచర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీరాజ్ జిల్లా అధికారి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దిర్శించర్ల రైతువేదికలో నేరేడుచర్ల, పాలకవీడు మండలాల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు నిత్యం చేపట్టాలన్నారు. ముందుజాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల నివారణ సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, ఎంపీవోలు హరిసింగ్, వీరయ్య, నేరేడుచర్ల, పాలకవీడు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

సూర్యాపేటక్రైం, జూలై 18, (ఆంధ్రజ్యోతి):వాహనాల లైసెన్స్ లేని వారు ఈనెల 25వ తేదీలోపు పట్టణంలోని పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. లైసెన్స్ లేని వారు వారి వివరాలు, రెండు ఫోటోలు, ఆధార్, పదో తరగతి మెమో, పాన్ కార్డును ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో అందచేయాలన్నారు. వివరాలకు సెల్:8712686034ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గరిడేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ హాస్టల్లోని విద్యార్థులకు ఎ టువంటి ఇబ్బందులు చూడాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా ఆడిట్ అధికారి శ్యాంసుందర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గడ్డిపల్లి సాంఘీక సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసి మాట్లాడారు. హాస్టల్‌లో గదులను పెంచాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని అన్నారు.అదనంగా మరో వంట మనిషిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థు లకు ఏర్పాటు చేసే సౌకర్యాలలో ఎలాంటి లోటు ఉండకూడదని ఆయన తెలిపారు. అనంతరం మర్రికుంట, గడ్డిపల్లి నర్సరీలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సైదానాయక్, వార్డెన్ వరప్రసాద్, నర్సరీ సిబ్బంది పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

నాగారం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా 419 రేషన్‌కార్డుల మంజూరయ్యాయని తహసీల్దారు హరికిషోర్‌శర్మ తెలిపారు. వీటిని శనివారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మునగాల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పల్లెల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పాలకుర్తి శ్రీకాంత్, గంట బిక్షపతి, పల్లెల రాము, గడ్డం ఉదయ్, పాక ఉపేందర్, మాగి శంకర్, కుందమల్ల నాగలక్ష్మి, గజ్జి మంజుల, సిరిపంగ రాధ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలి

కోదాడ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగర్ ఎడమకాల్వపై ఉన్న ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు, కొక్కిరేణి లిఫ్ట్ చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేశారుఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒక్కవంతుల ప్రభాకర్‌రావు, ముత్యాలు పాల్గొన్నారు.

జనన, మరణాలను రికార్డుల్లో నమోదు చేయాలి

మద్దిరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జనన, మరణాలను గ్రామ పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో నిర్వహించి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రికార్డుల్లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఆధార్ కార్డు నెంబర్లతో సహా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ వీరసోములు, ఎంపీవో సందీప్, డాక్టర్ అమూల్య, అనురాధ, శ్రావణి, పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్, నగదు బహూకరణ

నేరేడుచర్ల, జూలై1 8 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పిల్లలమర్రి కావేరికి గురువారం బీఆర్ఎస్వీ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబులు సైకిల్, రూ. 5వేల నగదును అందజేశారు. కావేరి తండ్రి, సోదరుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, నేరేడుచర్ల ప్రభుత్వ కళాశాలకు నిత్యం నడుచుకుంటూ కావేరి వెళుతుందని, ఈ విషయం తమ దృష్టికి రావడంతో జగదీష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చేయూతనందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, పల్లెపంగ నాగరాజు, లింగయ్య, ఎండీ హుస్సేన్, ఖైరాబీ,పాల్గొన్నారు.

టీడీపీలోనే పేద వర్గాలకు సముచిత స్థానం

మద్దిరాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): టీడీపీలోనే బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం ఉంటుందని టీడీపీ తుంగతుర్తి నియోజక వర్గ కన్వీనర్ ఆకారపు రమేష్ అన్నారు. శుక్రవారం మద్దిరాల కేంద్రంలో టీడీపీ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన జలగం నరేష్, ఉపాధ్యక్షుడిగా తొనుగునూరు రమేష్, ప్రధాన కార్యదర్శిగా కొడిశాల లింగయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చిలువేరు లింగరాజు, శ్రీనివాస్, గజ్జి సోమయ్య, కార్యదర్శులుగా సోమయ్య, శివకృష్ణ, నిర్మల, కోశాధికారిగా మూమ మహేష్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నక్క రాంభనేష్, దండంపల్లి నరేష్, పాల్వాయి బాలయ్య, శివ పాల్గొన్నారు.

కుడకుడ రోడ్డును నాలుగు లేన్లగా మార్చాలి

సూర్యాపేట టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కుడకుడ రోడ్డులో గుంతలు పూడ్చి నాలుగు లేన్ల రోడ్డుగా మార్చాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో గల గుంతల వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. కుడకుడ రోడ్డు నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయన్నారు.రోడ్డు గంతల మయంగా మారిందన్నారు.